

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**పురిపండా జ్ఞాపకాలు**



నాకు మరీ చిన్నతనంలో అంటే పదేళ్ళ వయస్సులో విశాఖపట్నంలో మా ఇంటికి ఎదురుగా కొల్లూరి వీరభద్రరావుగారనే శ్రేష్ఠిగారుండేవారు. రాత్రి భోజనాలయ్యాక దాదాపు పదకొండు గంటలవరకూ వీధిలో ఆయన మడత కుర్చీవేసుకుని కూర్చుని ఉండగా భారత భాగవతాల పురాణ కాలక్షేపం జరుగుతూండేది. అరుగు మీద మరొక నలుగురు పెద్దలు కూర్చునేవారు. వారిలో ఒకరు మా నాన్నగారు. మరొకరు పురిపండా అప్పలస్వామిగారు. ఆయన గొప్పతనమో, శక్తి సామర్థ్యాలో, ప్రతిభా వ్యుత్పత్తులో అర్థమయ్యే వయసు కాదు నాది.

కానీ నిద్రపట్టక నేను అరుగుమీదకి ఎక్కి అల్లరి చేస్తుంటే "వీడిని పడుకోమని కసరండి బాబూ. పద్యం అర్థమయి చావడంలేదు" ఇలాంటిదేదో ఆయన అనేవారు. ఎవరో చెపితే తప్ప ఆయన రచయిత అని గుర్తుపట్టని మూర్తి అప్పలస్వామిగారిది.

దేవులపల్లినో, అవంత్స సోమసుందర్‌నో, రవిశంకర్‌నో - మరెవరినో చూస్తే వాళ్ళు కళాకారులని చెప్పకపోయినా కావచ్చుననిపిస్తుంది. కానీ పురిపండా మధ్య తరగతి సాదాసీదా మనిషిలా ఉండేవారు. ఆయనతో మాట్లాడితే వయసుకి ముందు పరుగులెత్తే ఉత్సాహం, మా కుర్రతనాన్నే పరుగులు తీయించే ఆవేశం. ఆయన ఉత్సాహపరిచి భుజం తట్టినట్లు చాలా తక్కువమంది చేయగలరేమో అనిపిస్తుంది.

మళ్ళీ మొదటికి వస్తాను. పైన చెప్పిన సంఘటనకి దాదాపు పదకొండు సంవత్సరాల తర్వాత నేనో దినపత్రికలో చేరాను. ఓ రోజు "మహాభారతం" పోస్టులో వచ్చింది. వెంటనే పురిపండా ఉత్తరం, "భారతాన్ని మీ పత్రికలో సమీక్షించండి" అంటూ. నవ్వు వచ్చింది.

భయమూ వేసింది. అప్పుడు భక్తిగా భారతమంతా చదివాను. ఆ రోజుల్లో నేను రాసింది సమీక్ష కాదు. ప్రశంస. అంతకు ముందెప్పుడో ఓ కథ "పగ" ఒకానొక దినపత్రికలో పడింది. అది చదివి బాగుందని మెచ్చుకుంటూ "అసురధివ" నుంచి ఉత్తరం రాశారు పురిపండా. ఆ రోజుల్లో కుర్ర రచయితలకి అవి బంగారు కితాబుల్లాగా అనిపించేవి.

నేను ఆయన్ని తరచూ గుప్తా బ్రదర్స్‌లో కలిసేవాడిని. పెద్ద గుప్తాగారు బతికున్న రోజులు. వాళ్ళంతా, ఆర్రుదని ఏకవచనంతో మాట్లాడుకుంటూంటే నాకు అబ్బురంగా ఉండేది. ఆ రోజుల్లో కవితా సమితి సభ్యులకు నన్ను పరిచయం చేశారు పురిపండా. ఆయన ఆప్తమిత్రులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. ఆయన్ని గుప్తా బ్రదర్స్‌లోనే పరిచయం చేశారు. ఆయనకి విశాఖపట్నం టౌన్‌హాలులో కనకాభిషేకం చేయించారు పురిపండా.

మధ్యాహ్నం నాలుగు గంటలకి నన్ను పిలిచి "సభలో ఏమైనా పద్యాలు చదువుతారా?" అన్నారు. నా ఉత్సాహానికి అవధుల్లేవు.

వెంటనే కూర్చుని పద్యాలు రాసి, అక్షరాలు అందంగా దిద్ది వేదికమీద చదివాను. "వెన్నెల తీవె కాలువలు వెల్లువలై పరువెత్తినట్టుగా, వన్నె దొడంగి నీ కవిత పర్వులు పెట్టెను" ఇలా సాగింది పద్యం.

మర్నాడు "ఈయనేనయ్యా నిన్న పద్యాలు చదివిన కవి కుర్రాడు" అని నన్ను శాస్త్రిగారికి పరిచయం చేస్తే, ఆయన నవ్వి నా భుజం తట్టడం ఇప్పటికీ బంగారంలాంటి జ్ఞాపకం.

ఆ రోజుల్లో పద్యాలు వ్రాయాలని సరదా. కృష్ణపక్షం, వైతాళికులు, సౌందరనందంలాంటివి నోటికి వచ్చేసేవి. గిరజాలూ, పైజమాతో తిరుగుతూ పాతిక పద్యాలు రాసి పరపతి సాధించాలనిపించే కుర్రకారు రోజులు. ఓ రోజు చాగంటి సోమయాజులుగారు మెయిన్‌రోడ్డు మీద కనిపిస్తే "పద్యాలు రాస్తున్నా మనల్ని ఎవరూ గుర్తుంచడంలేదు"లాంటి మాట ఏదో అన్నాను. ఆయన చుట్ట నోట్లోంచి తీసి తుపుక్కున ఉమ్మి "కుర్ర వెధవ్వి. నువ్వు ఏం రాశావని నిన్ను గుర్తించాలి" అని చీవాట్లు పెట్టారు. కళ్ళనీళ్ళ పర్యంతం అయి తర్వాతెప్పుడో పురిపండాకి చెప్పాను ఈ మాట.

"నలుగురికీ అర్థమయే భాషలో కథలు, నాటకాలు రాయండి" అన్నారాయన.

అదిగో ఆ క్షణంలో ఈ రచయిత చరిత్ర మరో మలుపు తిరిగింది.

పురిపండా 'మట్టి మనుషులు' నవలంటే నాకు ప్రాణం. వ్యక్తి ఇంకా ప్రాణపదం. జీవితంలో నూటికి నూరుపాళ్ళు సాహిత్యానికీ, సాహితీ సేవకీ అంకితమయిన గొప్ప వ్యక్తి, హితైషి పురిపండా.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments